విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

ఆదివారం 9 జూన్ 2024 8పేజీలు

కోట్లు దోచేసిన మాజీ మంత్రి

పెద్దిరెడ్డిని ప్రాసిక్యూట్ చేయాలి

– ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం

విశాలాంధ్ర– సత్యవేదు: రాష్ట్రంలో ఖనిజం,ఇసుక,గ్రావెల్ వంటి సహజ వనరులను విచ్చలవిడిగా కొల్లగొట్టి కోట్లు దోచేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ప్రాసిక్యూట్ చేయాల్సి ఉందని సత్యవేదు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అభిప్రాయ పడ్డారు.ఎమ్మెల్యేగా కొత్తగా ఎన్నికైన కోనేటి ఆదిమూలం తొలిసారిగా శనివారం సత్యవేదుకు రావడంతో పార్టీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా స్థానిక విఎంకే కళ్యాణమండపంలో టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన టిడిపి కార్యకర్తల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా కోట్లు దండుకున్న దొంగలు కొందరు విదేశాలకు పారిపోకుండా చూడాల్సి ఉందన్నారు.ఈ విషయాలు తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.ఇసుక ఖనిజ సంపద దోపిడిని తాను ప్రశ్నించినందుకే అసెంబ్లీ సీటు దక్కకుండా పెద్దిరెడ్డి అడ్డుపడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.అయినా కూడా చంద్రబాబు నాయుడు తనను అక్కున చేర్చుకుని సత్యవేదు శాసనసభ స్థానానికి పోటీ చేసే అవకాశాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఎలాగైనా తనను ఓడించాలన్న దుర్బుద్ధితో పెద్దిరెడ్డి కొందరిని ఎన్నికల బరిలోకి దించి పోటీ చేయించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.అయితే అన్ని వర్గాల వారు పూర్తి సహకారం అందించడం వల్లే తన విజయం సాధ్యమైంది అన్నారు. ఇందులో టిడిపి శ్రేణుల సమిష్ట కృషి ఎంతో ఉందన్నారు.రాష్ట్ర ప్రజలు నిజాయితీకి పట్టం కట్టినట్టు ఆయన చెప్పారు.ఇక సత్యవేదులో వర్గ విభేదాలు ఎక్కడ కూడా తలెత్తకుండా సమస్యలపైన సమిష్టిగా నిర్ణయం తీసుకోవాలన్నారు.రానున్న రోజుల్లో సత్యవేదులో టిడిపి తప్ప వేరే పార్టీకి అవకాశాలు లేకుండా ముందుకు వెళ్ళడానికి అందరూ సహకరించాలన్నారు.తాను ఇక ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.అదే సమయంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ కంటికి రెప్పల కాపాడుకుంటానన్నారు. సంక్షేమ పథకాల అమల్లోనూ సమన్యాయం పాటించడం జరుగుతుందన్నారు.ఈ నేపథ్యంలో తన విజయానికి కృషి చేసిన పార్టీ శ్రేణులకు,ప్రజలకు పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుకున్నారు.తదనంతరం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను టిడిపి నాయకులు,కార్యకర్తలు పూల మాలలు వేసి సాలువతో ఘనంగా

2

రామోజీరావు మృతికి తీవ్ర దిగ్భ్రాంతి

– చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాదరావు

విశాలాంధ్ర –చిత్తూరు : ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్, మీడియా దిగ్గజం రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చిత్తూరు ఎంపీ ప్రసాదరావు తెలిపారు. హైదరాబాదులో రామోజీరావు పార్థివదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అక్షర యోధుడికి ఘన నివాళి అర్పించారు. ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఓ సామాన్య కుటుంబంలో జన్మించి, అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు

2

తిరుమల అడిషనల్ ఎస్పీ

శివరామిరెడ్డి బదిలీ

విశాలాంధ్ర – తిరుమల : తిరుమల లో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న శివరామిరెడ్డిని శనివారం బదిలీ చేస్తూ రాష్ట్ర డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.తదుపరి ఆదేశాలు అందే వరకు వేచి చూడాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. కాగా శివరామిరెడ్డి ఈనెల ఆఖరికి పదవీ విరమణ పొందనున్నట్లు సమాచారం.

ప్రత్యర్థులపై దాడి...

ఇది చంద్రగిరి సంస్కృతి కాదు..

ప్రజా ఆశీర్వాదాన్ని.. అభివృద్ధికి జోడించాలి.. - ఇకనైనా పద్ధతి మార్చుకోండి..

- అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

- మీడియా సమావేశంలో టీడీపీ నేతలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హితవు

విశాలాంధ్ర –తిరుపతి రూరల్ : ప్రత్యర్థులపై దాడి.. ఇది చంద్రగిరి సంస్కృతి కాదని... ఇదీ ముమ్మాటికి చిత్తూరు రౌడీయిజమే అని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. శనివారం తిరుపతి రూరల్ మండలం తుమ్మల గుంటలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ఆశీర్వాదాన్ని.. అభివృద్ధికి జోడించాలని,కక్ష సాధిం పులకు దిగితే అనర్థాలే అని అన్నారు.ప్రశాంత చంద్ర గిరిని.. భ్రష్టు పట్టిస్తున్నారు .ఇకనైనా పద్ధతి మార్చుకోండి.అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఐదేళ్లు అధికారంలో ఉన్నా.. ఏనాడు టీడీపీ కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులకు ప్రోత్సహించలేదన్నారు. చేతనైతే చంద్రగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దండి. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.అభివృద్ధికి బాటలు వేయండని మీడియా సమావేశంలో టీడీపీ నేతలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హితవు పలికారు. గత 5 ఏళ్లలో ఎప్పుడూ చంద్రగిరిలో ఏలాంటి అల్లర్లు

2

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే

కఠిన చర్యలు

– జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్

విశాలాంధ్ర – చిత్తూరు : జిల్లాలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ ఒక ప్రకటనలో తెలిపారు.రాజకీయ వ్యక్తుల విగ్రాహాలు, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేసే వారిని ఎట్టి పరిస్థితిలో వదిలేది లేదని పేర్కొన్నారు.ప్రజాశాంతికి భంగం కలిగించిన లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన ఉపేక్షించమని తెలిపారు.ప్రభుత్వ ఆస్తులు ప్రజల సొత్తు కాబట్టి వాటిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికి ఉందన్నారు. సమాజంలో శాంతి, సమరసతని కాపాడటం మనందరి బాధ్యతని సోషల్ మీడియా లేదా వాట్సాప్ లలో ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే సందేశాలు, ఫోటోలు పోస్ట్ చేస్తే గ్రూప్ అడ్మిన్స్ వారే పూర్తి భాద్యత వహించాలని జిల్లా ఎస్.పి. గారు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాలలో కొందరు రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారని సమాచారం అందిందని ఇలాంటి పోస్టులు వ్యాపింపచేయడం ద్వారా ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. గ్రూపులలో ఎవరైనా ప్రజాశాంతికి విఘాతం కలిగించే విధంగా పోస్ట్ చేస్తే వారిపైనే కాకుండా గ్రూప్ అడ్మిన్ లపై కూడా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వివాదాస్పద విషయాలు లేదా తప్పుదారి పట్టించే సమాచారం పంపినవారిని గ్రూప్ నుండి

2

రామోజీరావు మృతికి తీవ్ర దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి) గురి చేసిందని ఆయన మీడియాకు తెలియజేసారు. ఈ సందర్భంగా అక్షర యోధుడు దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. 'మీడియా రంగంలో రామోజీరావుది ప్రత్యేక శకమన్నారు. ఈనాడు గ్రూప్ సంస్థలు స్థాపించి వేలాది మందికి ఉపాధి కల్పించాలని గుర్తు చేసిన ప్రసాద్ రావు . ఎన్నో సవాళ్లు, సమస్యలను అధిగమించి ఎవరికీ ఎక్కడా తలవంచకుండా విలువలతో సంస్థలు నడిపిన విధానం అందరికీ ఆదర్శనీయమని రామోజీరావు సేవలను కొనియాడారు. మీడియా రంగంలో ఆయన ఓ శిఖరమని అభివర్ణించారు. రామోజీరావు ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూప్ సంస్థల సిబ్బందికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు . అలాగే రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు దగ్గుమళ్ళ వెల్లడించారు. అలాగే చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ రామోజీరావు మరణ వార్త తెలిసిన వెంటనే హుటాహుటిన హైదరాబాదుకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు.

పెద్దిరెడ్డిని ప్రాసిక్యూట్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి) సత్కరించారు.ఈ క్రమంలో సత్యవేడు పట్టణ టిడిపి నాయకుడు మురళి(కోళ్ల చిన్న),జనసేన నాయకుడు బాలమురళీకృష్ణ,మదనంబేడు టిడిపి పార్లమెంటు యువత స్పోక్ పర్సన్ తులసిరామ్ తదితరులు ఎమ్మెల్యే ఆదిమూలంకు గజమాలవేసి సాలువతో సత్కరించారు.పలువురు డ్వాక్రా సంఘ మిత్రలు సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు చంద్రశేఖర్,మాజీ ఎంపీపీ మస్తాన్, పరమశివం,కాశీ ప్రతాపరెడ్డి,రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ నాయకుడు రోశయ్య,పీవీ పురం సుబ్రమణ్యం రాజు, బాలసుందరం రెడ్డి,ధనశేఖర్,ప్రభాకర్ రెడ్డి,లోకయ్య రెడ్డి,సురేష్,కావ్య,బిజెపి మండల అధ్యక్షుడు ముని ప్రతాప్,మునికృష్ణయ్య,జనసేన మండలాధ్యక్షుడు లావణ్య కుమార్,పలువురు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి) వెంటనే తొలగించాలి.అసత్య ప్రచా రాలు, విద్వేషాలను ప్రోత్సహించే పోస్టులు సృష్టించడం చట్టవిరు ద్ధం.రెచ్చగొట్టే పోస్టులు, ఫోటోలు, వీడియోలను షేర్ చేయడం లేదా స్టేటస్‌లుగా పెట్టడం నిషిద్ధం. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి అని సూచిం చారు. రాజకీయ విగ్రహాలు, ప్రభుత్వ ప్రైవేట్ ఆస్తులు ధ్వంసం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇలాంటి చర్యలు సామాజిక శాంతి భద్రతలకు ప్రమాదకరం కావున, వీటిని పూర్తిగా అరికట్టడమే లక్ష్యం.ఆస్తులు ధ్వంసం చేయడం ద్వారా సామాజిక కల్లోలాలు సృష్టించబడతాయి. ప్రజల్లో భయం, ఆందోళన, అసురక్షిత భావాలను పెంచుతుంది. ఇలాంటి చర్యలు సమాజంలో సంఘీభావాన్ని దెబ్బతీస్తాయి అని ఎస్పీ తెలిపారు.ప్రభుత్వ ఆస్తులు ప్రజల సొత్తు కాబట్టి వాటిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికి ఉందని.ప్రైవేట్ ఆస్తులు వ్యక్తిగత సంపద, కష్టార్జితం. వాటిని ధ్వంసం చేయడం వారి ఆర్థిక స్థితిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, ఆస్తులు ధ్వంసం చేయడం ద్వారా వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించడం అవుతుందని అన్నారు. ఆస్తుల ధ్వంసం చేయడం వంటి చర్యలు సమాజంలో విభేదాలు, విభజనలకు కారణమవుతాయి అని హెచ్చరించారు.సామాజిక సామరస్యాన్ని కాపాడుకోవడానికి ఇలాంటి చర్యలను తక్షణమే అరికట్టడం అవసరం.రాజకీయ విగ్రహాలు, ప్రభుత్వ ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని ఇలాంటి నేరగాళ్లను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కావని. ప్రజలు సామాజిక శాంతి భద్రతలను కాపాడుకోవడానికి సహకరించాలని, ఇలాంటి నేరచర్యలను అరికట్టాలని కోరారు.

ఇది చంద్రగిరి సంస్కృతి కాదు..

(మొదటి పేజీ తరువాయి) జరగలేదని,అభివృద్ధి లో చంద్రగిరి దేశానికి ఒక ఆదర్శంగా చేయాలని.. సుమారు 950 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశామని చెప్పారు.ప్రజలకు నిజాయితీగా సేవ చేశాం... ప్రతి పక్ష తెలుగు దేశం పార్టీ కార్యకర్తలను గౌరవంగా చూశామని తెలిపారు. తాను తిరుపతి రూరల్ యంపీపీగా గెలిచిన తరువాత మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేశా..తుడా ఛైర్మన్ గా నియోజకవర్గం మొత్తం కోట్లది రూపాయలు ఖర్చు చేశా ..ప్రజా సేవకై వచ్చిన తర్వాత నియోజకవర్గం మొత్తం 1600 వందల కిలోమీటర్లు పాదయాత్ర చేశాను. ప్రజల కష్టాలను తెలుసు కున్నాను.మా కుటుంబం మొత్తం జనంలోనే తిరుగుతూ సమస్యలు పరిష్కారంకై పని చేశాం ..ప్రజల సంతోషం కోసం అహర్నిశలు శ్రమించి కష్టంలో ఆదుకున్నాం.కానీ మొన్న ఎన్నికలలో ప్రజలు మార్పు కోరి వారికి అవకాశం ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని వెల్లడించారు.ఏడాది కాలంగా పార్టీ కార్యకర్తలు అన్ని పనులు మానుకుని నా వెంట తిరుగుతూ ఎంతో కష్ట పడ్డారు.నాకు లక్ష ఓట్లు వేశారు.. వాళ్లకి అందరికీ పాదాభి వందనం చేస్తున్నాను.ఓటు వేయని వారిని సైతం గౌరవిస్తున్నా.. మీకు మరింత సేవ చేసి మీ బిడ్డగా మంచి పేరు తెచ్చుకుంటానని తెలియజేశారు.టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన పులివర్తి నాని గారికి అభినందనలు... వారు ప్రజలకు మరింత సేవ చేసి, మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు.రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నా తుడా ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నా..తుడా ఛైర్మన్ గా ప్రజా సేవ చేసిన కాలం ఎంతో సంతృప్తిని ఇచ్చింది.తుడా నుంచి ప్రజలకు మంచి చేయడం కోసం ఛైర్మన్ గా నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.అదేవిధంగా అభివృద్ధి పనులు చేయడానికి సహకరించిన అన్ని రాజకీయ పార్టీల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

కాణిపాకం ఛైర్మన్ రాజీనామా

విశాలాంధ్ర చిత్తూరు : కాణిపాకం ఆలియా ఛైర్మన్ మోహన్ రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి పార్టీ ఓటమి చెందిన నేపథ్యంలో తన ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

అరణి శ్రీనివాసులుకు మంత్రివర్గంలో చోటు ఇవ్వాలి

- రాష్ట్ర అధ్యక్షులు, బలిజసేన ఆర్కాట్ కృష్ణప్రసాద్

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతి ప్రెస్ క్లబ్ నందు బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పాత్రికేయులతో ప్రెస్ మీట్ ఏర్పాటు ఏమనగా రాష్ట్ర కొత్త మంత్రి వర్గం లో అత్యంత వెనుకబడిన రాయలసీమ 8 జిల్లా ల నుండి ఎక్కువ మందికి మంత్రి వర్గం లో చోటు కల్పించాలని బలిజసేన అభ్యర్ధన ఏమనగా యెన్నో ఆశలతో గతంలో యెన్నడూ లేని విధంగా వైసీపీ ప్రభుత్వాన్ని దించి అభివృద్ధి కోరి రాయలసీమ లో మెజారిటీ కూటమి అభ్యర్థుల ను గెలిపించు కోవడం జరిగింది. రాయలసీమ లో అత్యంత సమస్యాత్మక నియోజకవర్గమైన తిరుపతి ని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. యెన్నో అరాచకంలను ఎదుర్కొని గత రికార్డు లను బద్దలు కొట్టి రాయలసీమ లోనే అత్యంత భారీ మెజార్టీతో అరణి శ్రీనివాసులు గారు గెలుపొందారు. తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు గారు తన సొంతసంస్థలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అన్ని వర్గాల పేద ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించి అందరివాడుగా , సీనియర్ నాయకుడు, సౌమ్యుడు గా పేరు తెచ్చుకున్నరు . తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి గా ప్రకటించిన తక్కువ కాలంలో నే అన్ని వర్గాల మన్ననలు పొంది భారీ మెజార్టీతో నెగ్గారు .రాయలసీమ జిల్లా లకు ముఖ్య కేంద్రం, ప్రపంచ పుణ్యక్షేత్రం తిరుపతి లో అనేక మంది విఐపి లు నివాసం కలిగి, దేశ, విదేశాల్ల నుండి నిత్యం ప్రముఖుల రాకతో ప్రోటోకాల్ సమస్య వల్ల తిరుపతి ఎమ్మెల్యే కు మంత్రి వర్గంలో చోటు అవసరం. గత వైసీపీ పాలనలో తిరుపతి చుట్టుపక్కల అత్యంత విలువైన ప్రభుత్వ ఆస్తుల దోపిడీ వెలికి తీయాలన్నా , తితిదే లో జరిగిన అన్యాయాలను వెలికి తీయాలన్న ,అరాచక శక్తుల అటకట్టించాలన్న , భవిష్యత్తులో కూటమి కి మంచి అండదండలు కలిగి ఉండాలన్నా, అంగబలం, అర్థబలం కలిగి రాయలసీమ లోనే మంచి సీనియర్ నాయకుడు గా గుర్తింపు పొంది, అనుభవజ్ఞుడు గా, ప్రముఖ పారిశ్రామిక వేత్త గా గుర్తింపు పొందిన అరణి శ్రీనివాసులు గారికి చోటు కలిస్తే పరిశ్రమల ఏర్పాటుకు, అభివృద్ధి కి అవకాశం ఉంటుంది. కనుక మా బలిజల ఆణిముత్యం అరణి శ్రీనివాసులు కు మంత్రి పోస్ట్ ఇవ్వాలని రాష్ట్ర బలిజసేన తరపున అభ్యర్థిస్తున్నాము.ఈ కార్యక్రమంలో బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ , రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెల్లంకొండ సురేష్ , జిల్లా యువనాయకులు చేరుకుల నీలాద్రి, తిరుమల బలిజసేన అధ్యక్షులు హరిప్రసాద్ , సురేష్ ,గుంటూరు గోపినాథ్ ,భాస్కర్ , వేణు రాయల్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

రామోజీ మరణం తెలుగు భాషకు తీరని లోటు

విశాలాంధ్ర - గంగవరం : బహుముఖ ప్రజ్ఞాశాలి, పద్మ విభూషణ్ రామోజీరావు మరణం తెలుగు భాషా సంస్కృతి సాహిత్యాలకు తీరని లోటు అని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి . తులసినాథంనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు . తెలుగు భాషను కాపాడడానికి రామోజీరావు విశేష కృషి చేశారన్నారు.తెలుగు భాష రక్షణకు కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే నివాళి అన్నారు.

అక్షర యోధునికి అశ్రునివాళి

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : ఈనాడు ఈటీవీ ద్వారా అవినీతిపై గళమెత్తి.. తన సమర్థ నాయకత్వంతో అనేక వ్యాపార సంస్థలని విజయవంతంగా నిర్వహించి వేల మందికి ఉద్యోగాలు కల్పించి తెలుగు జాతికి దారి చూపిన వెలుగు దివ్వెలా ఉన్నత స్థాయికి చేరిన రామోజీ రావు జీవితం నేటి తరానికి బావి తరానికి స్ఫూర్తిదాయకమని ఆదర్శం అని టిడిపి మాజీ అధ్యక్షుడు జయచంద్రనాయుడు క్లస్టర్ ఇన్చార్జి పన్నెం నిర్మల్ అన్నారు వరదయ్యపాలెంలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో రామోజీ రావు ఆకస్మిక మరణం పట్ల నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ మాజీ అధ్యక్షులు నరసరాజు చలపతి నాయుడు, నాయకులు శివయ్య శ్రీనునాయుడు మునిభూషణమ్మ, సురేష్ రెడ్డి, కుమార్, హరి ప్రసాద్ చౌదరి, వినోద్, సెల్ కన్వీనర్ రమణయ్య, మాజీ సర్పంచ్ రవిరెడ్డి బీజేపీ నాయకులు దిలీప్ రాయల్ పాల్గొన్నారు

మీడియాకు విలువలు పెంచిన రామోజీరావు

- తెలుగు యువత

విశాలాంధ్ర- తిరుపతి : ఆరంభంలో రైతుగా కొనసాగుతూ.. ఈనాడు పత్రిక ద్వారా పత్రికా రంగంలో 50 సంవత్సరాల క్రితం అడుగు పెట్టిన.. రామోజీరావు దేశవ్యాప్తంగా మీడియాకు విలువలు పెంచారని... తెలుగు యువత నేత రవి నాయుడు కొనియాడారు. తిరుపతి ప్రెస్క్లబ్లో శనివారం మీడియా ముందు టీఎన్ఎస్ఎఫ్ , తెలుగు యువత నాయకులు వాసుదేవ్ , కరణం సంతోష్ , గణేష్ , సునీల్ , శ్రీరాం బాబ్జి , సందీప్ తదితరులతో కలిసి రవి నాయుడు మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ పాలనలో విశ్వవిద్యాలయాలను రాజకీయ కేంద్రాలుగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ విద్యార్థి నాయకులతోపాటు తనపై 57 కేసులు వైకాపా పెట్టించిందని గుర్తు చేశారు. అలాగే ఫ్యాన్ పార్టీ ఎన్టీఆర్ విగ్రహాలను ధ్వంసం చేసిందన్నారు. ఎంతోమంది టిడిపి కార్యకర్తలని బలి తీసుకు న్నారన్నారు. పదవులు శాశ్వతం కాదని ఎవరు తప్పు చేసినా శిక్ష అనుభవించాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం అండతో పదవుల్లో ఉన్నవారు స్వచ్ఛందంగా రాజీనామాలు చేసి సీట్లు ఖాళీ చేయాలని డిమాండ్ చేశారు.

ఆలయ ఛైర్మన్ పదవికి ఏవీఎం బాలాజీ రెడ్డి రాజీనామా

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి శనివారం తన పదవికి రాజీనామా చేశారు.ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని సురుటు పల్లి ఈవో కార్యాలయ అధికారులకు అందజేశారు .ఇటీవల వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్ఆర్సిపి పార్టీ ఘోర పరాజయ కావడంతో నైతిక విలువలకు కట్టుబడి ఆలయ ఛైర్మన్ పదవికి బాలాజీ రెడ్డి రాజీనామా చేయడం జరిగింది. ఆలయ ధర్మకర్తల మండల ఛైర్మన్గా ఏవీఎం బాలాజీ రెడ్డి గత ఏడాది ఫిబ్రవరిలో పదవి ప్రమాణం చేశారు. అయితే 15 నెలలు తర్వాత రాష్ట్ర అసెంబ్లీకి, పార్లమెంటుకు ఎన్నికల జరగడంతో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఓటమి పాలయింది.దీంతో టిడిపికి ప్రజలు పట్టం కట్టారు.ఈ నేపథ్యంలో నామినేటెడ్ పదవుల్లో కొలువుతీరిన వారందరి నుంచి రాజీనామాలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశం చింది.ఈ క్రమంలో సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వల్ప కాలంలోనే ఆలయ అభివృద్ధికి సహకరించిన పాలక మండల సభ్యులకు,ఆలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామాల్లో టిడిపి సంబరాలు

విశాలాంధ్ర - దొరవారిసత్రం : దొరవారి సత్రం మండల పరిధిలోని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలను చేసుకుంటున్నారు. ఐదేళ్ల నుండి ప్రతిపక్షంలో ఉంటూ అనేక కేసులను, సమస్యలను ఎదుర్కొన్నామన్నారు.వైఎస్ జగన్మోహన్ రెడ్డి అరాచకాలకు శాశ్వతంగా బ్రేక్ పడిపోయిందని సంబరాల్లో మునిగిపోయారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా విజయ శ్రీ, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అత్యధిక మెజారిటీతో గెలవడంతో మండల పరిధిలోని సింగనాలత్తూరు, ఏకొలు, అక్కర పాక, తనయాలి, బుదురు, తదితర గ్రామాలలో నాయకులు ఆధ్వర్యంలో బాణ సంచులపేల్చి పూలమాలతో సంబరాలు చేసుకుంటున్నారు.

రామోజీరావు మృతికి టీడీపీ సంతాపం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణ కార్యాలయంలో శనివారం టీడీపీ నాయకులు రామోజీ రావు చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెల బల్లి భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు వాటంబేటి శివకుమార్, తాతపూడి ఇశ్రాయేలు కుమార్, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఎండీ. అబ్దుల్ రహీమ్, మల్లికార్జున్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, చంద్రమౌళి, పులిమి శివ కుమార్, రావూరు సురేంద్ర, రత్నయ్య, మీరయ్య, టీ. చిరంజీవి, యువత వేముల సునీల్, గుండాల సందీప్, పురిణి దయాకర్, అరవింద్, పార్వతయ్య, లీలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీ రావు మృతి పట్ల తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం

విశాలాంధ్ర- తిరుపతి : ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీ రావు మృతి పట్ల తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీ కి కుమారుడు ఆరణి మదన్ తో చేరుకుని రామోజీ రావు పార్థివ దేహనికి నివాళులు అర్పించారు. తెలుగు మీడియా మొఘల్ గా పేరుపొందిన రామోజీ రావు మృతి తెలుగు పత్రికా రంగానికి తీరని లోటని ఆరణి శ్రీనివాసులు అన్నారు. సినిమా రంగంలోనూ రామోజీ రావు చెరగని ముద్ర వేశారని ఆయన చెప్పారు. రామోజీ రావు పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని శ్రీ వేంకటేశ్వర స్వామిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. రామోజీ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని ఆరణి శ్రీనివాసులు వ్యక్తం చేశారు.

నారా లోకేష్‌కు ముక్కంటి ప్రసాదాలు

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ కు శనివారం తిరుపతి పార్లమెంటు ఎస్టీ విభాగం అధ్యక్షులు ఎం.సుబ్బయ్య ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. నారా లోకేష్ మంగళగిరి శాసనసభ్యులుగా విజయం సాధించడంతో ఉండవల్లిలో సుబ్బయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

బొజ్జల బృందమ్మకు సన్మానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి శాసనసభ్యులుగా విజయం సాధించిన బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మను శనివారం ఊరందూరులో కంఠా సుబ్ర హ్మణ్యం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో అందరూ స్వచ్ఛందంగా అహర్నిశలు కష్టపడి అఖండ మెజారిటీతో సుధీర్ బాబు ని గెలిపించారన్నారు. శ్రీకాళహస్తి ప్రజల కష్టాలు తీరుస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రమణగారి అనిల్ బాబు, మొద్దు హేమ కుమార్, తిరుమలశెట్టి కిరణ్ కుమార్, యుగంధర్, రవి పాల్గొన్నారు.

ఆరనికి క్యాబినెట్లో స్థానం కల్పించాలి : బలిజ సేన వెల్లడి

విశాలాంధ్ర- తిరుపతి : రాష్ట్రంలో జనసేన పార్టీ ఎమ్మెల్యేగా .. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ తర్వాత తిరుపతి లో అధిక మెజారిటీ సాధించిన .. ఎమ్మెల్యే ఆరణీ శ్రీనివాసులకు మంత్రి పదవి కట్ట బెట్టాలని .. బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సురేష్ లు కోరారు. తిరుపతి ప్రెస్క్లబ్లో శనివారం మీడియా ముందు బలిజ సేన నాయకులు హరిప్రసాద్ , చెరుకుల నీలాద్రి , గుంటూరు గోపీనాథ్ , భాస్కర్ , సురేష్ తదితరులతో కలిసి వీరు మాట్లాడుతూ .... బీజేపీ , టీడీపీ , జనసేన కూటమిల ప్రభంజనంతో ఆరని భారీ మెజార్టీతో గెలిపించారని గుర్తు చేశారు... తమ పవన్ కళ్యాణ్ గతంలో రాష్ట్రంలో కూటమి పాలన రావడానికి కాపులు పెద్దన్న పాత్ర పోషించాలని కోరడం అందరికీ తెలిసిన అన్నారు. అదేవిధంగా రాయలసీమ ప్రాంతంలోనే భారీ మెజార్టీతో గెలిచిన ఆరనికి కూటమి నేతలు పెద్దన్న ల స్థానంలో నిలిచి మంత్రి పదవిని ఇవ్వాలని కోరారు.

చంద్రబాబు మానస పుత్రికను ఆదుకోవాలి

ఏపీ కేబుల్ ఆపరేటర్స్ జేఏసీ

విశాలాంధ్ర- తిరుపతి :టిడిపి ప్రభుత్వంలో ఏర్పడ్డ ఏపీ ఫైబర్ నెట్వర్క్ ను ఆనాటి సీఎం చంద్రబాబు నాయుడు తన మానస పుత్రిక అని ఆనాడు చెప్పారని..... నిన్నటి వరకు వైకాపా ప్రభుత్వ ఉక్కు కౌగిలిలో నలిగి నష్టాలలో కూరుకుపోయి ఉన్న ఏపీ ఫైబర్ నెట్వర్క్ ను నేడు అధికారంలోకి వచ్చిన ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని... ఏపీ కేబుల్ ఆపరేటర్స్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరుమల్ మధు కోరారు. తిరుపతి ప్రెస్క్లబ్లో శనివారం మీడియా ముందు రాష్ట్రంలోని కేబుల్ ఆపరేటర్స్ ప్రతినిధులు విచ్చేసి.. కేబుల్ ఆపరేటర్స్ యొక్క సాధక బాధలను , కష్టనష్టాలను మీడియా ముందు తెలియజేశారు. కేబుల్ ఆపరేటర్ చనిపోతే అతని భార్య , కుటుంబ సభ్యులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కూడా ఎలక్ట్రానిక్ మీడియాలో ఒక భాగం అని గుర్తు చేశారు. తాము టీవీకి కనెక్షన్ ఇస్తే ఎలక్ట్రానిక్ మీడియా వార్తలు ప్రజలు చూస్తున్నారని కొనియాడారు. విధి నిర్వహణ భాగంగా పోల్స్ ఎక్కి , కరెంటు షాక్ కు గురై తమ ఆపరేటర్ చనిపోతున్నారని , తమకు ప్రభుత్వ%శీ% గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు.. వైసీపీ ప్రభుత్వం ఇబ్బంది పెట్టినట్టు చేయకుండా .. న్యాయమైన రేట్లకు ఏపీ ఫైబర్ కనెక్షన్ ను ఆపరేటర్లకు అందించాలన్నారు. ఆర్థికంగా నష్టాల్లో ఉన్న ఆపరేటర్లను ఆదుకోవాలని అన్నారు.సభ ప్రారంభంలో.. ఈనాడు గ్రూప్ అధినేత రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్రంలోని కేబుల్ ఆపరేటర్స్ జేఏసీ నాయకులు మిరియాల శ్రీరాములు , బసవయ్య , జగదీష్ , బుల్లెట్ బాబు , రమణ , దుర్గాప్రసాద్ , ప్రకాష్ , నగేష్ , బాబు , ఆనంద్ , లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో బర్డ్‌లో రోగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

విశాలాంధ్ర- తిరుపతి : బర్డ్ ఆసుపత్రిలో 110 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఇటీవల తమిళనాడు ధర్మపురికి చెందిన దాత సుబ్రమణియన్ బర్డ్ ఆసుపత్రిలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆధునీకరణకు రూ.కోటి విరాళంగా అందించిన విషయం తెలిసిందే.ఇందులో భాగంగా యూకే సాంకేతిక సహకారంతో ఎండోలైట్ కంపెనీ అత్యాధునిక సాంకేతిక సహకారంతో తయారు చేసిన ఎక్కువ మన్నిక గల కృత్రిమ అవయవాలను ఉచితంగా అందించారు. బర్డ్ ఆసుపత్రి చేస్తున్న సేవలకు గానుఎండోలైట్ కంపెనీ అసలు ధరలో 50 శాతం రాయితీతో అల్యూమినియంతో తయారు చేసిన ఈ కృత్రిమ అవయవాలను టీటీడీకి అందించారు.వీటిని ధరించిన రోగులు సాధారణ వ్యక్తుల్లాగే అత్యంత సులభంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా నడవగలుగుతున్నారు. ఇదివరకు తాము జైపూర్, ఇతర ప్రాంతాల్లో తయారైన కృత్రిమ అవయవాలను ఉప యోగించామని, వాటికంటే కూడా ఈ అవయవాలు సౌకర్యవంతంగా ఉన్నాయని రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బర్డ్ ఆసుపత్రి డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది, రోగుల బంధువులు పాల్గొన్నారు.

రామోజీరావుకు టీడీపీ నేతల నివాళి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావుకు శనివారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ లో టీడీపీ నేతలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రంగినేని చెంచయ్యనాయుడు, దశరథాచారి, కంఠా రమేష్, రామచంద్రయ్య, నెమళ్లూరు బుజ్జి, జలానీ, దారా పాండు, వెంకటేశ్వరచౌదరి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 11న అఖండ అయోధ్యకాండ పారాయణం 11వ ఎడిషన్

విశాలాంధ్ర -తిరుమల : 2024: మానవాళి శ్రేయస్సును కోరుతూ జూన్ 11న తిరుమలలోని నాద నిరంజనం వేదికపై 11వ అయోధ్య కాండ అఖండ పారాయణాలను టీటీడీ నిర్వహిస్తుండగా, ఉదయం 7.00 గంటల నుంచి ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఉదయం నుండి 9.00 వరకు.పారాయణంలో అయోధ్యకాండలోని 40-45 సర్గల 162 శ్లోకాలు, యోగవాశిష్టం యొక్క 35 శ్లోకాలు మరియు ధన్వంతి మహా మంత్రం మొత్తం 187 శ్లోకాలు ఉంటాయి.ఎస్వీ వేద విజ్ఞాన పీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, అన్నమాచార్య ప్రాజెక్టు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి టీటీడీ సంభవ పండితులు పాల్గొంటారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తమ ప్రయోజనాల కోసం ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న పారాయణాల్లో పాల్గొనాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

రామోజీరావు మరణం తీరని లోటు

రామోజీరావు మీడియా రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయం
ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకరరెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తెలుగు మీడియా రంగంలో కొత్త వరువడి సృష్టించిన మహనీయుడు,మీడియా దిగ్గజం, జర్నలిజానికి విశ్వసనీయత,కొత్త సొబగును దిద్దిన రామోజీరావు మరణం మీడియా రంగానికి తీరని లోటు,ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని నేటి జర్నలిస్టులకు ఆయన స్ఫూర్తి అని,రామోజీరావు మరణం మీడియా రంగంతో పాటు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకరరెడ్డి అన్నారు.తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో శనివారం దొడ్ల కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దొడ్ల కరుణాకరరెడ్డి మాట్లాడుతూ మీడియా రంగానికి దశాదిశా చూపిన దార్శనికుడు రామోజీరావు ఇక లేరు అన్న వార్త ఆవేదన కలిగిస్తుందన్నారు.ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ,రామోజీ మృతికి సంతాపం తెలిపారు.కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చెంగల రామానాయుడు,శ్రీనివాస్ రాయల్ భాస్కర్ రెడ్డి,వరదరాజుల రాయల్, రాధ రాయల్, రేవంత్, నవీన్ కుమార్, సురేష్, కృష్ణ వంశీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రామోజీ రావు మృతి తీరని లోటు

విశాలాంధ్ర - కార్వేటినగరం : సామాన్య రైతు కుటుంబం లో పుట్టి అంచల్ అంచెలుగా ఎదిగి వ్యాపారవేత్తగా రాణించి, తెలుగు పత్రిక రంగానికి ఎనలేని సేవలు చేసిన మహానుభావుడు ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు అనారోగ్యంతో మృతి చెందడం రాష్ట్ర ప్రజలకి తీరని లోటు అని జిల్లా రైతు సంఘ అధ్యక్షులు ఎన్ నాగేశ్వర రాజు, రాష్ట్ర రైతు కార్య నిర్వాహక కార్యదర్శి ఎం జనార్దన్ రాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా రంగంలో ఎంతో సేవ చేశారని పేర్కొన్నారు. వ్యాపారవేత్తగా కూడా మంచి పేరు తీసుకువచ్చారన్నారు. జీడి నెల్లూరు ఎమ్మెల్యే థామస్ తమ్ముడు నిధి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చంగ్రాల యాదవ్, మాజీ ఎంపిటిసి వై రాధాకృష్ణ యాదవ్, బీసీ సంఘ అధ్యక్షులు రవి యాదవ్, బీగాల రమేష్, దాసరి గణేష్ పి ధనగిరి రెడ్డి, ప్రకాష్, కె ప్రసాద్ జయచంద్ర యాదవ్,, జగన్నాథం,తదితరులు ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేశారు.

తెలుగుకు వెలుగు నింపిన రామోజీ రావుకి నివాళులు

- ప్రెస్ క్లబ్లో టిడిపి నేతలు

విశాలాంధ్ర- తిరుపతి : అర్థ శతాబ్దం క్రితం ఈనాడు పేపర్ను స్థాపించి .. నేటికీ తెలుగు కు వెలుగు నింపుతూ పత్రిక , మీడియా రంగాలలో ప్రధానంగా ఉంటూ అధినేతగా రామోజీరావు చిరస్మరణీయుడని... తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం , పెరుమాళ్ మధు బాబు లు కొనియాడారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో శనివారం మీడియా ముందు తెలుగుదేశం నాయకులు చరణ్ , రాజ్ , రఫీ , సలీం , చిన్నారావు , విజయలక్ష్మి , టీవీ లక్ష్మి తదితరులతో కలిసి వీరు మాట్లాడుతూ... రామోజీ మీడియా ద్వారా భారతదేశం గర్వించదగ్గ ఎడిటర్ గా పేరు ప్రఖ్యాతలు సాధించారన్నారు. తిరుపతి ఉమ్మడి కూటమి అభ్యర్థి ఆరని శ్రీనివాసులు విజయం ... తిరుపతి ప్రజల విజయంగా భావిస్తున్నామన్నారు. ప్రజల ప్రతి సమస్యను తమ బిజెపి , జనసేన , టిడిపి కార్యాలయాలకు తెలియజేస్తే పూర్తి పరిష్కారం ఉంటుందని పిలుపునిచ్చారు. రామోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తూ ... జోహార్ రామోజీ జోహార్ అంటూ నినాదాలు చేశారు.

యువ నాయకుడును సత్కరించి కోనేటి సుమన్ కుమార్



విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నారాయణ వనం మండలంలోని ఎరికంబట్టు తిరువట్టం గ్రామాలకు చెందిన దళిత యువ నాయకుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గుజ్జెలి మహేష్ తిరుమలను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు చిత్తూరు ఉమ్మడి జిల్లా జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు సుమన్ కుమార్ తో సత్కరించారు ఈటీవీలో జరిగిన ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా సత్యవేడు నియోజకవర్గ నుంచి పోటీచేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గెలుపు కోసం పనిచేయడం పట్ల అభినందించారు పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు ఆయన తెలిపారు.

రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరనిలోటు

విశాలాంధ్ర - రామకుప్పం : ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరనిలోటని ఆయన లేని లోటు పూడ్చలేనిదని మండల మీడియా సోదరులు పేర్కొన్నారు శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం పలువురు మాట్లాడుతూ మీడియా రంగంలో ఒక ప్రభంజనం సృష్టించి వార్తా ప్రపంచంలో ఒక నూతన అధ్యాయాన్ని నెలకొల్పారని అదేవిధంగా విశ్వసనీయత కు ఆయన పెట్టింది పేరని మీడియా రంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు మీడియా రంగం ఆయన లేని లోటును పూరించలేనిదని పేర్కొన్నారు కార్యక్రమంలో గోకుల్ కుమార్, నజీర్ అహ్మద్, జగదీష్, శ్రీనివాసులు రెడ్డి, నరేంద్ర బాబు, నాగరాజు, సంధిల్, రవి, నవీన్, తదితరులు పాల్గొన్నారు

తెదేపా నాయకులకు ఘనంగా సన్మానం

విశాలాంధ్ర -బైరెడ్డిపల్లి : మండలంలోని ప్రజలు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డికి మంచి మెజారిటీ ఇవ్వడంతో తెలుగుతమ్ముళ్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమ%శి%లోనే లక్కనపల్లి పంచాయతీలో ఉన్నటువంటి తెదేపా నాయకులు,కార్యకర్తలు మా గ్రామం తెదేపాకు గతంలో అనుకూలంగా లేదు.ఈ సార్వత్రిక ఎన్నికల్లో మంచి మెజార్టీ వచ్చింది ఈ ఆనందంలో లక్కన పల్లి పంచాయతీలో ఉన్నటువంటి రాముల వారి ఆలయ దర్శనానికి రావాలని పంచాయతీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు కోరగా వారి కోరిక మేరకు మండల అధ్యక్షులు బి ఎం కిషోర్ గౌడు,పలమనేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు భువనచంద్ర గౌడు, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి రఘుచంద్ర గుప్త రామనపల్లి గ్రామ బాట పట్టారు. వారి రాకతో తెలుగు తమ్ముల్లో మంచి జోష్ నెలకొన్నది. గ్రామస్తులు స్వాగతం పలికి పూలమాల,దుశ్శాలువ కప్పి అభినందనలు తెలిపారు. తెదేపాకు మంచి మెజార్టీ ఇవ్వడంపై మండల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు అదేవిధంగా మండలంలో తెదేపాకు మంచి మెజారిటీ సాధించి పెట్టడంలో ప్రముఖ పాత్ర వహించిన మండల తెలుగుదేశం సీనియర్ నాయకులు కృష్ణవేణి విజయ్ కుమార్ లను కూడా బైరెడ్డిపల్లి మండలం డీలర్ సంఘం నాయకులు సభ్యులు , మరియు కురపల్లి గ్రామ ప్రజలు శనివారం వారి స్వగృహంలో సత్కరించారు . ఈ కార్యక్రమంలో లక్కనపల్లి మరియు కురపల్లి తెలుగుదేశం కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - రేణిగుంట : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులకు సిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో రేణిగుంట పట్టణంలో నిర్వహించారు రేణిగుంట పంచాయతీ వేణుగోపాలపురంలో శనివారం వర్షాకాలంలో దోమలు వాటి నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేణిగుంట వైద్యాధికారి ఛత్రప్రకాష్ రెడ్డి సీజనల్ వ్యాధులపై ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు తెలియ చేశారు. ఛత్రప్రకాష్ రెడ్డిఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు ఆధ్వర్యంలో ఏఎన్ఎం లోహిత ఆశ కార్యకర్తలు శంషాద్, రుక్మిణి, జబీన, లక్ష్మీప్రసన్న లు స్థానికులకు వర్షపు నీరు వాటి వలన దోమల అభివృద్ధి అవగాహన కల్పించారు ఇళ్లల్లో బయట కుండీలలో అక్కడక్కడ నీటి నిల్వ వలన దోమలు ఏ విధంగా పెరిగి రోగాలకు కారణం అవుతాయో ప్రజలకు చూపించారు. కావున ప్రజలు దోమలు పెరగకుండా ఇంటి పరిసరాలలో శుభ్రం చేసుకుని అనారోగ్య బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు.

శ్రీ రామోజీరావు మృతికి సిపిఎం సంతాపం

విశాలాంధ్ర- తిరుపతి : ఈనాడు సంస్థలు, ప్రముఖ వ్యాపారవేత శ్రీ రామోజీరావు మరణం బాధాకరమని సిపిఐ(యం) జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొ న్నారు. ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. శ్రీ రామోజీరావు తెలుగు మీడియా రంగానికి నూతన వరవడి దిద్దారని, పత్రికా విలువలు నిలబెట్టడంలో ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. సుందరయ్య, రాజేశ్వరరావు లాంటి ప్రముఖక మ్యూనిస్టు నాయకు ల్నిఎంతోఅభిమానించేవారని తెలియజే శారు.రామోజీరావు మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి లోటని పేర్కొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి శిబిరాలు

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : పుత్తూరు లోని శాఖ గ్రంథాల యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం గ్రంథాలయ అధికారి మీనా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరంలో పుస్తక పఠనం, కథలు చెప్పించడం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, పెయింటింగ్ వంటి పలు అంశాలలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ క్యాంపులో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించామన్నారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది సుజాత పాల్గొన్నారు.

చంద్రగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సందడి

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం తెలుగు తమ్ముళ్లు సందడి చేశారు. భారీ మెజారిటీతో గెలుపొందిన తర్వాత ఎమ్మెల్యే పులి వర్తి నాని మొదటిసారిగా చంద్రగిరి కి రావటంతో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున బాణాసంచా మోత, యువత కేరింతలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. టీడీపీ నేతలు గంగపల్లి భాస్కర్, భాను ప్రకాష్ రెడ్డి (బన్నీ) చిత్రపటాలకు ఎమ్మెల్యే నాని పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నాయకులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు .గంటకు పైగా కార్యక ర్తలతో ముచ్చటించారు. తన విజయానికి పట్టుదలతో కృషిచేసిన నాయకులు కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీవారి మెట్టు సమీపంలో ఆటో డ్రైవర్లు ఆగడాలు, దాడి

విశాలాంధ్ర - చంద్రగిరి: తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తి శ్రద్ధలతో వెళ్లే యాత్రికులు ఆటో డ్రైవర్ల ఆగడాలతో బెంబేలెత్తుతున్నారు. శనివారం ఉదయం తిరుపతి ఆటో డ్రైవర్లకు శ్రీనివాసమంగాపురం ఆటో డ్రైవర్లకు పరస్పరం గొడవలు జరిగి శ్రీనివాస మంగాపురం డ్రైవర్లు తమను కొట్టారంటూ తిరుపతికి చెందిన ఆటో డ్రైవర్లు చంద్రగిరి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తిరుపతి ఆటో డ్రైవర్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుదీర ప్రాంతాల నుండి శ్రీవారి దర్శనార్థం తిరుపతి చేరుకున్న యాత్రికులను వివిధ స్టాండ్ల నుండి తాము ఎక్కించుకొని తిరుపతి నుండి శ్రీవారి మెట్టు వద్దకు చేర్చి యాత్రికులు శ్రీవారి మెట్టు సమీపంలో గల టోకన్లు తీసుకొనేంత వరకు వేచి ఉండి తిరిగి వారిని అలిపిరి మెట్ల మార్గం దగ్గర చేరుస్తుంటామన్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఉదయం జీవకోనకు చెందిన దంతం వెంకటేష్ తిరుపతిలో యాత్రికులను ఎక్కించుకొని శ్రీవారి మెట్టు వద్ద యాత్రికులను చేర్చి, యాత్రికులు టోకన్లు తీసుకున్న అనంతరం తిరిగి తిరుపతికి వస్తుండగా శ్రీనివాస మంగాపురానికి చెందిన ఆటో డ్రైవర్లు శ్రీవారి మెట్టు శ్రీనివాస మంగాపురం మధ్యలో గల పంప్ హౌస్ వద్ద అడ్డగించి మీరు తిరుపతిలో యాత్రికులను ఎక్కించుకుని శ్రీనివాస మంగాపురం వరకే ఆటోలు నడపాలి ఆ తర్వాత మేము శ్రీవారి మెట్టు వద్దకు యాత్రికులు తీసుకువెళ్లి తిరిగి శ్రీనివాస మంగాపురంలో వదిలేంత వరకు ఉండి వారిని తీసుకెళ్లాలని మాతో గొడవ పడినట్లు వెంకటేష్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అదెలా సాధ్యమవుతుంది అనగానే శ్రీనివాసమంగాపురానికి చెందిన ఆటో డ్రైవర్లు వెంకటేష్ ను బూతులు తిట్టి తన వెనకనే వచ్చిన తిరుపతి ఆటో డ్రైవర్లు లోకేష్ వంశీలను చేతులు రాళ్లు కర్రలతో కొట్టి రక్తగాయాలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని వివరాల సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాతీర్పును స్వాగతిస్తాం

అభివృద్ధిని ప్రోత్సహిస్తాం - కార్యకర్తల జోలికొస్తే సహించం

వాస్తవాలు గ్రహించి మాట్లాడాలి

- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

విశాలాంధ్ర – గూడూరు : సార్వత్రిక ఎన్నికలలో ప్రజా తీర్పును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. శనివారం సనత్ నగర్లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల ఫలితాలు బాధను కలిగించినా ప్రజా తీర్పును స్వాగతిస్తామన్నారు. సుదీర్ఘంగా రాజకీయాలలో ఉంటూ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, వైసీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. ఇకపై కూడా నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైసీపీ కార్యకర్తల జోలికొస్తే మౌనంగా ఉండబోమన్నారు. న్యాయమైన పోరాటాలు సాగిస్తామన్నారు. అవసరమైతే కోర్టులను కూడా ఆశ్రయిస్తామన్నారు. తిప్పవరప్పాడులో ట్రీ కటింగ్ టెండర్ ప్రక్రియతోనే నిర్వహించారన్నారు. అధికారంలో ఉన్నామని అబద్దాలను నిజం చేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు. హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా పనిచేసుకు వెళ్లడమే తన అభిమతమన్నారు. ప్రతి పక్షంలో తనకు కొత్తేమీ కాదన్నారు. రాష్ట్ర మంతా ప్రజలు మార్పును కోరుకున్నారు. స్వాగ తిస్తున్నామన్నారు. ఎవరూ అధైర్యపడొద్దన్నారు. రాష్ట్రంలో దుర్మార్గమైన వాతావరణం కనిపిస్తోం దన్నారు. అధికారాన్ని చేతిలోకి తీసుకునే ప్రయత్నం చేస్తే పోరాడుతామన్నారు. ఎన్నికలలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభిమానులు, 80 వేల పై చిలుకు ఓట్లు వేసిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి గురుమూర్తి గెలుపు సంతృప్తినిచ్చిందన్నారు. వైసీపీ పట్టణాధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన ధర్మరాజులస్వామి అధ్యక్ష, కార్యవర్గ సభ్యులందరూ రాజీనామాలు చేయనున్నట్లు ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన వారందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ. మగ్దూమ్ మొహిద్దీన్, రుద్రరాజు, అన్నం మురళీ, మండ్ల రాజేష్, పూర్ణ చంద్ర, రఫీ, గోకుల్, శ్రీనాథ్, శశి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

భూమిలో కొస్తే చంపేస్తాం...

అంటున్న అగ్రకుల పెత్తందారులు

- ఓ మహిళ ఆవేదన

విశాలాంధ్ర – పలమనేరు : తమ పూర్వీకులు సంపాదించిన భూమిలో సాగు చేసుకుంటుంటే అగ్రకుల పెత్తందారులు ఓర్వ లేక తమ భూములోకి రానివ్వకుండా వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని లక్ష్మమ్మ అనే మహిళ తనకు జరిగిన అన్యాయాన్ని శనివారం పలమనేర్ ప్రెస్ క్లబ్ లో వివరించారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు పెద్దపంజాణి మండలం బెరపల్లి గ్రామమునందు సర్వే నెంబర్ 225/3ఏ,6/ఖ,8/ఏ,3/ఎ,6/ఏ,8/ఖలో మొత్తం. 2.39 సెంట్లు భూమి మునెమ్మ, మునివెంకటప్ప పేర్లు మీద ఉన్నదని భూమిని పండించి కుటుంబాలు పోషించుకునేవారమని సుమారు 10 సంవత్సరాల క్రితం ముని వెంకటప్ప అదే గ్రామానికి చెందిన త్రిలోక రెడ్డికి 40 వేల రూపాయలకు భోగ్యానికి పెట్టారని తెలిపారు. అప్పటినుండి సదరు భూమిని మేమే సాగు చేసేవారిని ఈ మధ్యకాలంలో త్రిలోక రెడ్డి భూమి తనకే అమ్మేశారని అడ్డుపడుతూ దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. 8 సంవత్సరాల క్రితం త్రిలోక రెడ్డికి 40 వేల రూపాయలు గాను వడ్డీ తో సహా లక్ష 25 వేల రూపాయలు చెల్లిస్తే పత్రాలు తిరిగి ఇవ్వకుండా కాలహరణ చేస్తున్నాడని కంటతడి పెట్టారు. భూమితో పాటు తమకు సంబంధించిన రెండు చింతచెట్లను కూడా వదలకుండా త్రిలోక రెడ్డి, జనార్దన్ రెడ్డి, దిలీప్ రెడ్డి,, శారదమ్మ, లోకనాథం రెడ్డి, శంకర్ రెడ్డి, భైయా రెడ్డి, దౌర్జన్యంగా ఆక్రమించుకొని అడిగితే మమ్మల్ని కొట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమకు జరిగిన అన్యాయంపై పెద్దపంజాణి ఎస్సై, తాసిల్దారులకు విన్నవించుకున్న ఇంతవరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకులాల వారికి, ధన, రాజకీయ బలాలు మెండుగా ఉండటముతో ఎదిరించలేక పోతున్నామని న్యాయం కోసం మీడియా వారిని సంప్రదించామని తెలిపారు.

తడలో అక్షర యోధుడికి ఘనంగా నివాళులు



విశాలాంధ్ర – తడ : తడ మండల కేంద్రంలోని తడ బస్టాండు కూడలి లో అక్షర యోధుడు, ఈనాడు, మార్గదర్శి సంస్థల చైర్మన్ రామోజీరావు చిత్రపటానికి శనివారం తడ మండల తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కే మురళి రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా మురళి రెడ్డి మాట్లాడుతూ పేద రైతు కుటుంబంలో పుట్టి అంచలంచలుగా ఎదుగుతూ తెలుగు పత్రిక రంగానికి గుర్తింపు తెచ్చిన వ్యక్తి రామోజీరావు గారని తెలుగు రాష్ట్రాలకు చేసిన సేవలు వెలకట్టలేనివి అని అన్నారు. పత్రికా రంగానికి, మీడియాకు ఒక గుర్తింపు ఖ్యాతి తెచ్చిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల కోసమే ఆయన అక్షరం కదిలిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జిల్లా యూత్ ఉపాధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి ,నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ రవి , మండల జనరల్ సెక్రెటరీ నీలకంఠం ఉపాధ్యక్షులు సుందరం , జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు జీవా, రాష్ట్ర మత్స్యశాఖ సెక్రటరీ శివాజీ ఎక్స్ ఎం పి టి సి మనోహర్, కాశిశెట్టి ,ఏకాంబరం శెట్టి, రమేష్, మోహన్, గుణసుందరి పాల్గొన్నారు.

రచయిత కలువగుంట , అక్షరయోధుడు రామోజీరావుల సంతాపసభ

విశాలాంధ్ర -తిరుపతి : ప్రముఖ కవి, రచయిత, బావుక బ్రహ్మ కలువగుంట రామమూర్తి రెండు రోజుల క్రితం గుండె పోటు తో మరణించిన విషయం తెలిసిందే. వారి మృతి పట్ల తిరుపతి జిల్లా రచయితల సంఘం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్త పరిచింది. వారి రచనలను, తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను శనివారం తిరుపతి నగరంలోని బైరాగి పట్టెడలోని చాంబర్స్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన సంతాప సభలో పలువురు సాహితీ వేత్తలు,స్మరించుకుని నివాళి అర్పించారు.అక్షరయోధుడు రామోజీ రావుకు అక్షరాంజలి గొప్ప కలలు కని ఆ కలలను నిజం చేసుకుని దానికి కొన్ని దశాబ్దాలు కష్టపడి, ప్రతి కలనీ ప్రజా కోటికి కళ్లారా చూపించిన శ్రామికుడు రామోజీ రావు అంటూ ప్రపంచంలో ఇలాటి వారు అరుదుగా పుడతారని శ్లాఘిస్తూ ఇలాంటి వారి కణజాలాన్ని సేకరించి శాస్త్రవేత్తలు పరిశోధనలు జరపాలని రచయితల సంఘం అభిలషించింది.తెలుగు భారతికి వెలుగు హారతి పట్టిన మార్గదర్శి రామోజీరావు ఆకస్మిక మరణంతో అందరినీ దుఃఖ సంద్రంలోకి నెట్టారని, తెలుగు భాషకు, పత్రికా రంగానికి, సినిమా రంగానికి, వ్యాపార రంగానికి, సమాచార మాధ్యమంలోనూ విప్లవాన్ని తీసుకువచ్చారని , ఈనాడు, విపుల, చతుర, తెలుగు వెలుగు, బాలభారతం, అన్నదాత,సితార వంటివి పత్రికలు తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధి కోసం విశేష కృషి చేశారని పలువురు రచయితలు, మేధావులు కొనియాడారు.ఈ సంస్మరణ సభలో శ్వేత సంచాలకులు భూమన్, మధురాంతకం నరేంద్ర , రాసాని, శేష శైలేంద్ర, తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధర ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు యువశ్రీ మురళి, రచయితలు ఆర్.సి.రాజు, పేరూరు బాలసుబ్రమణ్యం, శ్రీమన్నారాయణ ,మల్లేశ్వరరావు, కాంతారావు, సుభద్ర, వేమూరి జయరాం ప్రసాద్,రొద్దా సురేంద్ర, నద్ది నారాయణ, టెంకాయల దామోదరం, చెన్నకేశవులు నాయుడు ,గొడుగు చింత గోవిందయ్య , చిట్టి ,తదితరులు పాల్గొని వారిరువురితో గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

మాతమ్మ ఆలయానికి రూ.50వేలు విరాళం

విశాలాంధ్ర -తొట్టంబేడు: తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాలెంకు చెందిన మునిరాజేశ్వరి అలియాస్ చిట్టెమ్మ అనే తెలుగుదేశం మహిళా నాయకురాలు శనివారం మాతమ్మ ఆలయానికి రూ.50వేలు విరాళంగా అందించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఈ విరాళం స్వీకరించారు. ఈ సందర్భంగా చిట్టెమ్మ మాట్లాడుతూ... శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సూచనల మేరకు ఈ విరాళం అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆమె మాతమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు చిట్టెమ్మకు సన్మానం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీ కార్యకర్త సిద్ధయ్య మృతికి నివాళులర్పించిన దొడ్ల కరుణాకరరెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట పంచాయితీ ఆది ఆంధ్రవాడకు చెందిన టీడీపీ కార్యకర్త సిద్ధయ్య ఆకస్మికంగా మృతి చెందారు.శనివారం సమాచారం అందుకున్న టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకరరెడ్డి సిద్ధయ్య నివాసం వద్దకు చేరుకున్నారు.పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం సిద్ధయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.తక్షణ సాయంగా ఐదువేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందించారు.సిద్ధయ్య కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ ఆ కుటుంబానికి అందేలా చేస్తానని ఆయన చెప్పారు.

ఘనంగా దువ్వూరు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - దొరవారి సత్రం: దొరవారి సత్రం మండల పరిధిలోని కుప్పారెడ్డి పాలెం గ్రామ సమీపంలోని ఉన్న మహర నిరాసుల స్వచ్ఛంద సంస్థలో శనివారం 60వ దువ్వూరు పుట్టినరోజు వేడుకలు ఘనంగా ఏర్పాటు చేశారు. సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డ్ దువ్వూరు బాలచంద్రారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏకోలు సర్పంచ్ ఆవుల బ్లెస్సి, ఆమె భర్త ఆవుల అనీల్ కుమార్ కుటుంబ సభ్యులతో నిరాశ ఆశ్రమంలో ఉన్న మానసిక రోగులకు, పిల్లలకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ ఆశ్రమానికి కావలసిన వంట సామాగ్రిని, సర్పంచ్ ఆవుల బ్లెస్సి అందిస్తామన్నారు.

జన హితమే రామోజీరావు అభిమతం

- టిడిపి నాయకులు డాక్టర్ ఉమేష్ రావు, నెమళ్ళూరు బుజ్జి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ప్రజా పక్షపాతి, అలుపెరుగని అక్షర యోధుడైన స్వర్గీయ రామోజీ రావు జన హితమే తన అభిమతంగా జీవించారని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి గుర్తు చేసుకున్నారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న ఈనాడు గ్రూపు సంస్థల అధినేత స్వర్గీయ చెరుకూరి రామోజీరావు ఆకస్మిక మరణానికి సంతాపం తెలుపుతూ, స్థానిక పూసల వీధి కూడలిలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూజలు చేసి, రామోజీరావు కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీ రావు మృతి తెలుగు సమాజానికి తీరని లోటని, తను ఎంచుకున్న వృత్తి పట్ల ఎంతో నిబద్ధత కనబరిచి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయన ఉద్యమస్ఫూర్తితో పని చేశారని ఉమేష్ కొనియాడారు. మీడియా రంగంలో రామోజీరావుది ప్రత్యేక శకమని, ఎన్నో సవాళ్ళను, సమస్యలను అధిగమించి ఎక్కడా తలవంచకుండా విలువలకు ప్రాధాన్యతనిస్తూ తన సంస్థలను నడిపిన విధానం ప్రతీ ఒక్కరికి ఆదర్శమని నెమళ్ళూరు బుజ్జి కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పురపాలక సంఘం, 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, తెలుగుదేశం పార్టీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, మైనారిటీ విభాగం సీనియర్ నాయకులు సయ్యద్ చాంద్ బాషా, బిసి విభాగం నాయకులు కృష్ణమూర్తి, గణేష్, శివ, చంద్ర, మైనారిటీ విభాగం నాయకులు షేక్ జిలానీ, షేక్ రియాజ్, మొఘల్ అహ్మద్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు పాత్రికేయుల సంతాపం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: ఈనాడు సంస్థ అధినేత, అక్షర యోధులు చెరుకూరి రామోజీరావు మృతికి శనివారం శ్రీకాళహస్తి పాత్రికేయులు సంతాపం తెలియచేశారు. ఈ సందర్భంగా పాత్రికేయలు మాట్లాడుతూ... బహుముఖ ప్రజ్ఞ.. కఠోర సాధన.. ఇవే రామోజీ అస్త్రాలు అన్నారు. నలుగురు నడిచిన బాట కాదు.. కొత్త దారులు సృష్టించడం ఆయన నైజం అన్నారు. లక్ష్య సాధనకు దశాబ్దాలపాటు నిర్విరామంగా పరిశ్రమించిన యోధుడని కొనియాడారు. రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారన్నారు. మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించిన అక్షర యోధుడు రామోజీ రావు అన్నారు. ఆయన లేని లోటు మీడియా రంగానికి తీరని లోటన్నారు. పనిలోనే విశ్రాంతి అనేది ఆయన ప్రాథమిక సూత్రం అన్నారు. చివరి క్షణం వరకు పనిలోనే విశ్రాంతి సిద్ధాంతాన్ని పాటించిన ఆధునిక భగీరథుడు అని కొనియాడారు. రామోజీరావు మీడియానే కాకుండా చిత్ర పరిశ్రమలో సైతం తనదైన ముద్ర వేసి తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆఖరి క్షణం వరకూ రామోజీరావు ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించారన్నారు. రామోజీరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని పాత్రికేయులు కోరుకున్నారు.

వ్యక్తి నుంచి ఓ వ్యవస్థగా ఎదిగిన

అక్షర యోధుడు రామోజీరావు

రామోజీరావు మృతికి గూడూరు పాత్రికేయుల సంతాపం

విశాలాంధ్ర - గూడూరు : వ్యక్తి నుంచి ఓ వ్యవస్థగా ఎదిగిన అక్షర యోధుడు రామోజీరావు గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సీనియర్ పాత్రికేయులు ఎస్.కే. జమాలుల్లా అన్నారు. శనివారం గూడూరు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో రామోజీ గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి పాత్రికేయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన ఘనత రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావుకే దక్కుతుందన్నారు. 1936 నవంబర్ 16న కృష్ణా జిల్లా పెదపారుపూడిలో రామోజీరావు జన్మించారని, ఈనాడు దినపత్రికను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారన్నారు. 1974 ఆగస్టు 10న విశాఖ సాగర తీరంలో 'ఈనాడు'ను ప్రారంభించారన్నారు. ప్రారంభించిన నాలుగేళ్లలోనే పాఠకుల మానసపుత్రికగా ఈనాడు మారిందన్నారు. ఈనాడుతో పాటు కీలక మైలురాయిగా సితార సినీ పత్రిక నిలిచిందన్నారు. బహుముఖ ప్రజ్ఞ.. కఠోర సాధన, ఇదే రామోజీ అస్త్రాలన్నారు. నలుగురు నడిచిన బాట కాదు కొత్త దారులు సృష్టించడం ఆయన నైజమన్నారు. లక్ష్య సాధనకు దశాబ్దాలపాటు నిర్విరామంగా పరిశ్రమించిన యోధుడన్నారు. సామాన్య రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, షోకాస్ దినపత్రిక సంపాదకులు ఉడుతా శరత్ యాదవ్ మాట్లాడుతూ రామోజీరావు మరణించడం చాలా బాధాకం మన్నారు. భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చినదార్శనికుడన్నారు. జర్నలిజం, సినీ ప్రపంచంపై చెరగని ముద్ర వేసేశారన్నారు. మీడియాలో రామోజీరావు సరికొత్త ప్రమాణాలను నెలకొల్పారని, ఆయన్నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నామన్నారు. నిజాలను ప్రజలకు చేరవేయాలి, ప్రభుత్వాలు ప్రజల కోసం పని చేసేలా ఉండాలని తపించే వ్యక్తి చెరుకూరి రామోజీరావు అన్నారు. ఎక్కడో చిన్న రైతు కుటుంబంలో పుట్టి అచంచలమైన కష్టంతో ప్రపంచం మెచ్చే వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించిన తీరు అనితర సాధ్యమన్నారు. ఎన్నో ఆటుపోట్లు.. మరెన్నో అవమానాలు అన్నింటినీ ఎదురొడ్డి, రామోజీరావు ఈ స్థాయికి చేరారన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలని ఈనాడు అనే మీడియా వ్యవస్థను స్థాపించి ప్రజలకు తోడుగా నిలిచారు. మార్గదర్శి చిట్‌ఫండ్, ప్రియా ఫుడ్స్, కళాంజలి లాంటి ఎన్నో వ్యాపార సంస్థల్ని స్థాపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేశారు. అతి తక్కువ సమయంలోనే జాతీయస్థాయి నెట్ వర్క్ గా ఈటీవీని విస్తరించారన్నారు. జనగర్జన సంపాదకులు సీనియర్ మనోహర్ రెడ్డి, తులసిరాజు, సురేష్, గుమ్మడి అనిల్ కుమార్ (నాని), శివ కుమార్, కిషోర్ నాయుడు, వెంకయ్య, రాజు, యువ పాత్రికేయులు లక్ష్మణ్, నిరంజన్, కృపా నిధి, వినయ్ కుమార్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అక్షర యోధుడు శ్రీ రామోజీరావుకి అశ్రునివాళులు అర్పించిన లోకనాథ్

విశాలాంధ్ర - చంద్రగిరి: ఈనాడు రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీ రావు మరణం తీవ్ర ఆవేదనకు గురిచేసిందని బాకరాపేటకు చెందిన హెచ్.లోకనాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రామోజీరావు చిత్రం పటానికి పూల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎవరికి తలవంచని మేరు పర్వతం దివికేగిందని జనహితమే తన అభిమతంగా పనిచేసిన మహానుభావుడు ప్రజాహితం కోసం పాటుపడిన మహనీయుడు నిత్యం ఉషోదయంతో సత్యం నినదించుగాక గాక అని కొనియాడారు. ప్రతి తెలుగువారి తలుపు తట్టిన 'ఈనాడు ' లో తాను 30 ఏళ్ల పాటు సేవ అందించడం నేను చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నానన్నారు. చిన్న గొట్టిగల్లు, ఎర్ర వారి పాలెం, చంద్రగిరి మండలాల రిపోర్టరుగ 30 ఏళ్లపాటు పనిచేయడం, ఆయన సైన్యంలో నేను ఒక్కడు కావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. నిత్యం స్మరించుకునే మహనీయుడుకి ఆత్మశాంతి కలగాలని మనసారా కోరుకుంటున్నానని అశ్రునయనాలతో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మీడియా దిగ్గజం రామోజీరావు మృతికి గుడిపాల మండల తెదేపా నాయకులు సంతాపం

విశాలాంధ్ర - గుడిపాల : అక్షర యోధుడు రామోజీరావు మరణం మీడియా, పారిశ్రామిక, సినీ రంగాలకు తీరని లోటని గుడిపాల మండల తెలుగు దేశ అధ్యక్షుడు చలిచీమల సుబ్రహ్మణ్యం నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఉన్నత విలువలతో ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచిన మహనీయ వ్యక్తిత్వం రామోజీరావుది అని కొనియాడారు. విలువల విషయంలో రాజీ పడకుండా సవాళ్లను అధిగమిస్తూ పద్మభూషణ్ అవార్డు గ్రహీతగా కీర్తి పొందారన్నారు. వ్యవసాయ, పాత్రికేయ, సినీ, పారిశ్రామిక రంగాల్లో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. తెలుగు రాష్ట్రాలకు ఆయన మరణం తీరని లోటని నివాళులు అర్పించారు, ఈ సంతాప కార్యక్రమములో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు అబిమానులు టి సాంబశివ నాయుడు, రవి నాయుడు, శేఖర్ నాయుడు, శంకర్ చౌదరి , మురళి నాయుడు, ప్రతాప్ నాయుడు, జయపాల్ విల్సన్, శివారెడ్డి, బిజెపి అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, శంకర్ గౌడు తదితరులు ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ షాపుల్లో చెత్తబుట్ట ఏర్పాటు చేసుకోవాలి: ఎస్సై

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట లో శనివారం సూళ్లూరుపేట ఎస్సై రహీం రెడ్డి రోడ్లపై ట్రాఫిక్ కి అంతరాయంగా ఉన్న తోపుడు బండ్లను, అంగళ్లను తీసివేయాలంటూ బాధితులకు తెలియపరిచారు. అలాగే షాప్ యజమానులు రోడ్లపై చెత్తాచెదారులు వేయకూడదని షాపులు ముందర పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్క షాపు నందు ఒక డస్ట్ బిన్ ను ఏర్పాటు చేసుకొని చెత్తను ఆ డస్ట్ పిన్ లో వేయవలసిందిగా కోరారు. పురపాలక సిబ్బంది ప్రతిదినం ఆడేస్టును తీసుకొని వెళతారని తెలియపరిచారు. మన ఊరును మనమే శుభ్రపరచుకోవాలని తెలిపారు. అలాగే ట్రాఫిక్ కి అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రహీంరెడ్డి తెలిపారు.

నిత్య కృషీవలుడు రామోజీరావు

సంతాపాన్ని తెలియజేసిన అమరనాథ రెడ్డి

విశాలాంధ్ర – పలమనేరు : పత్రికా రంగంలో ఎనలేని కృషి చేసి తెలుగు పత్రికా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న నిత్య కృషీవలుడు ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు అని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి అన్నారు. రామోజీరావు మరణ వార్త తెలుసుకున్న ఆయన శనివారం ఓ ప్రకటనలో తన సంతాపాన్ని తెలియజేశారు. రామోజీరావు మృతి చాలా బాధకరమని ఎందరికో మార్గదర్శకులు శ్రమే తన ఆయుధంగా మలుచుకొని ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎంతో ఎత్తుకు ఎదిగి ఎన్నో రంగాలల్లో ఆయన తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఎందరికో మార్గదర్శకులైన రామోజీ రావు మనమధ్య లేరు అన్న వాస్తవం ఆయన అభిమానులకు కఠినమైన దైనా భరించక తప్పదని ఆవేదన వ్యక్తపరచారు. ఆయన మృతికి సోకతప్త హృదయంతో నివాళులు అర్పిస్తూ వారి కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

పార్టీ గెలుపుకు కృషి చేసిన చంద్రశేఖర్ కు తెలుగుదేశం పార్టీ ఆశీస్సులు

టిడిపి బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి : గడచిన ఐదు సంవత్సరాల కాలంలో అనేక అకృత్యాలకు పాల్పడిన వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి యొక్క నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేసిన తెలుగుదేశం పార్టీ నాయి బ్రాహ్మణ సాధికార సమితి నాయకుడు కోట చంద్రశేఖర్ కు తెలుగుదేశం పార్టీ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయి బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం శ్రీకాళహస్తి పురపాలక సంఘం, 18వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో స్థానిక జయరాం రావు వీధి కూడలిలో చంద్రశేఖర్‌ను దుశ్శాలువా తో సత్కరించి, స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, తెలుగుదేశం పార్టీ మైనారిటీ విభాగం సీనియర్ నాయకులు సయ్యద్ చాంద్ బాషా, బిసి విభాగం నాయకులు కృష్ణమూర్తి, గణేష్, శివ, చంద్ర, మైనారిటీ విభాగం నాయకులు షేక్ జిలానీ, షేక్ రియాజ్, మొఘల్ అహ్మద్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 11న అయోధ్యకాండ 11వ విడత అఖండ పారాయణం

విశాలాంధ్ర – తిరుమల : లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై జూన్ 11వ తేదీ 11వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం జరుగనుంది. ఉదయం 7 నుండి 9 గంటల వరకు జరుగనున్న ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.అయోధ్యకాండలోని 40 నుండి 44వ సర్గ వరకు మొత్తం ఐదు సర్గల్లో 162 శ్లోకాలు, యోగవాశిష్టం మరియు ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 187 శ్లోకాలను పారాయణం చేస్తారు. ఎస్.వి.వేద విజ్ఞాన పీఠం, ఎస్.వి.వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, టీటీడీ సంభావన పండితులు, శ్రీ అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు ఈ పారాయణంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరడమైనది.

రామోజీరావు మృతి తీరనిలోటు..!

-సంతాపం ప్రకటించిన భీమినేని చిట్టిబాబు

విశాలాంధ్ర–వెదురుకుప్పం: ఈనాడు,ఈటీవీ సంస్థల అధినేత రామోజీరావు మృతి మీడియా,సినీ రంగాలకు తీరనిలోటు అని టిడిపి రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు అన్నారు.శనివారం ఆయన మీడియా తో మాట్లాడుతూ..అక్షర దిగ్గజం అయిన రామోజీరావు పారిశ్రామిక,వ్యవసాయ రంగాల అభివృద్ధి కి సైతం విశేషంగా సేవలందించారని కొనియాడారు.ఆయన చేసిన కృషివల్ల లక్షల మంది కి ఉపాధి కలిగిందన్నారు.ముఖ్యంగా రామోజీరావు మృతి తెలుగుదేశం పార్టీ కి తీరని లోటు అన్నారు.ఆయన మృతి కి ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

రామోజీ రావు మృతి పట్ల సంతాపం తెలిపి తెలుగుదేశం పార్టీ నాయకులు

విశాలాంధ్ర– సూళ్లూరుపేట.. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మీడియా సామ్రాజ్యాధినేత, తెలుగు పత్రికా రంగంలో ఎనలేని కృషి చేసి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న నిత్యకృషీవలుడు ఈనాడు రామోజీ రావు , వారి మరణ వార్త అత్యంత బాధాకరం. తెలుగువారి హృదయాల్లో రామోజీరావు చెరగని ముద్ర వేశారు. ఆఖరి క్షణం వరకు ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించారు. పనిలోనే విశ్రాంతి అనేది ఆయన ప్రాథమిక సూత్రం. అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ రామోజీరావు చెరగని ముద్ర వేశారు. ఆయన లేని లోటు పూడ్చలేనిది. వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతిని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి ,సూళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుతోట రమేష్ ,తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు చిటేటి పెరుమాళ్ ,తిరుపతి పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు అలవల శ్రీనివాసులు ,సూళ్లూరుపేట నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు కుదిరి పెంచలయ్య , తెలుగుదేశం పార్టీ నాయకులు సురేష్,బండారు అంజి, కొండలరావు,చెంగయ్య,మస్తాన్,సత్యనారాయణ రాజు,తెలుగుదేశం పార్టీ యువ నాయకులు శ్రీ ఆలీభాయ్,దాసరి శశిధర్, తాతపూడి ఇమాని,సూళ్లూరుపేట పట్టణ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీ నెల్లూరు తేజా యాదవ్,పట్టణ తెలుగు యువత సభ్యులు ధనా రెడ్డి,ప్రశాంత్,హరీష్ నాని,మురళి,దినేష్,శశి,మస్తాన్ యాదవ్,ముని ప్రశాంత్,వివేక్, పెంచల్,మహేష్,భరత్ తదితరులు

కాలినడకతో శ్రీవారి మొక్కులు తీర్చుకున్న టిడిపి శ్రేణులు

విశాలాంధ్ర–వెదురుకుప్పం: టిడిపి అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అలాగే జీడి నెల్లూరు నుంచి డా థామస్ ఎమ్మెల్యే గా అసెంబ్లీ లోకి వెళ్లాలని తిరుమల వెంకన్న కు మొక్కులు ఉన్న నేపథ్యంలో శనివారం యనమల మంద గ్రామానికి చెందిన నియోజకవర్గ ఎస్సి సెల్ కార్యదర్శి మరకాలకుప్పం సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు తిరుమల కు కాలినడకన వెళ్లి మొక్కులు తీర్చుకున్నట్లు చెప్పారు.ముందుగా శ్రీవారి మెట్ల వద్ద కొబ్బరికాయలు కొట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడి నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే థామస్ ఆధ్వర్యంలో సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని అన్నారు.ముఖ్యంగా నియోజకవర్గంలో ప్రజానీకం కాంగ్రెస్,వైఎస్సార్ పార్టీ పాలనలో విసిగి వేసారిపోయారని అన్నారు.వెంకన్న ఆశీస్సులతో టిడిపి పాలన జనరంజకంగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో యనమల మంద గ్రామస్తులు పాల్గొన్నారు.

రామోజీరావు కు ఘన నివాళి

విశాలాంధ్ర – వి.కోట.... ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు మృతికి మండల తెలుగు దేశం పార్టీ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.వివిధ వ్యాపార రంగాలలో ఆయన అంచెలంచెలుగా ఎదిగి చేరుకున్న ఉన్నత స్థాయి గురించి పలువురు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, మాజీ జెడ్పీటీసీ చౌడప్ప, బోడిగుట్టపల్లి సర్పంచ్ విశ్వనాథ్, పట్టణ కార్యదర్శి ముకుంద నాయుడు, నారాయణ స్వామి, సతీష్, అమర, మురళి, గౌస్ పీర్, ఇక్బాల్, యాసీర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన పాత్రికేయులు

విశాలాంధ్ర – గూడూరు : గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ ను ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. రెండవసారి ఎమ్మెల్యేగా ఎన్నికవడం పట్ల శాలువా కప్పి, పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ జమాలుల్లా, ప్రధాన కార్యదర్శి శరత్ యాదవ్, ఉపాధ్యక్షులు బాలకృష్ణ గౌడ్, సీనియర్ పాత్రికేయులు నాని, సురేష్, లక్ష్మణ్, తులసి రాజు, శివకుమార్, యువ పాత్రికేయులు నిరంజన్, నరసింహా రావు, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సంబరాలు

విశాలాంధ్ర– పీలేరు:– నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది ఉద్యోగ విజయం గా భావిస్తూ ఈరోజు పీలేరు స్థానిక టీటీడీ కళ్యాణ మండపం నందు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు గత ప్రభుత్వంలో ఎన్నో అనాలోచితం నిర్ణయాల వలన విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది. ప్రస్తుతం ఏర్పడుతున్న నూతన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం అవుతాయని విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందని అలాగే ఉద్యోగస్తులతో స్నేహ పూర్వకంగా మెలిగే ప్రభుత్వంగా భావిస్తున్నామని రాబోయే కాలంలో ఉద్యోగస్తులకు ఎటువంటి ఆర్థికపరమైన టువంటి నష్టం గానీ ఉద్యోగపరమైనటువంటి నష్టంగానీ కలగజేయరని భావిస్తున్నామని తెలియజేశారు విద్యావ్యవస్థలో చాలా మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది అదేవిధంగా పూర్వ వైభవాన్ని ప్రభుత్వ పాఠశాలకు తీసుకు రావాలని ఈ సందర్భంగా ఎన్‌టిఏ నాయకులు ఏం రెడ్డి రమేష్ బాబు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మరియు రాష్ట్ర కార్యదర్శి పోతం శెట్టి రమేష్ అదేవిధంగా పచ్చార్ల సుధాకర్ డిమాండ్ చేశారు.

శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న

ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని)ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి లు శనివారం చంద్రగిరిలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపర్డెంట్ వెంకట్ స్వామి, ఆర్జిత సేవా ఇన్స్పెక్టర్ ధణశేఖర్ అర్చకులు, అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పులివర్తి నాని దంపతులను వేద పండితులు ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వెనుక బడిన రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని స్వామి వారిని కోరినట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమల పోలీస్ కాంప్లెక్స్ ను ఆకస్మికంగా తనిఖీలు చేసిన జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు

విశాలాంధ్ర -తిరుమల : శ్రీవారి భక్తులతో మర్యాదపూర్వకంగా, హుందాగా వ్యవహరించి పోలీసుల ఖ్యాతిని ప్రపంచ స్థాయికి పెంచాల్సిన బాధ్యత మనదే.స్థానిక బాలాజీ నగర్ పరిసరాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి, పర్యవేక్షణ.భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీల వివరాలు పోలీస్ స్టేషన్లో నమోదు చేసుకొని, వారి కార్యకలాపాలపై నిఘా పెంచాలి.జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు శనివారం నాడు ఉదయం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తిరుమల పోలీస్ కాంప్లెక్స్ ను సందర్శించి, విస్తృతంగా తనిఖీలు చేశారు.పోలీస్ కాంప్లెక్స్ లోని తిరుమల వన్ టౌన్, టూ టౌన్, క్రైమ్ పోలీస్ స్టేషన్ల లోని ప్రతి గదిని పరిశీలించి నేరుగా సిబ్బందితో మాట్లాడి, వారు నిర్వహిస్తున్న విధులను గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం స్థానిక పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, తిరుమల లో శాంతి భద్రతల పర్యవేక్షణ చేస్తున్న విధానం, అలాగే ప్రస్తుతం శ్రీవారి భక్తులకు కల్పిస్తున్న భద్రత ఏర్పాట్లు, క్రౌడ్ కంట్రోల్ గురించి తెలుసుకున్నారు.పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ శ్రీవారి భక్తులతో నిత్యం మర్యాదపూర్వకంగా, హుందాగా వ్యవహరిస్తూ జిల్లా పోలీసుల ఖ్యాతిని ప్రపంచ స్థాయికి పెంచాల్సిన బాధ్యత మనదే అని జిల్లా ఎస్పీ ఆదేశించారు.తిరుమలలో విధులు నిర్వహిస్తూ భక్తులకు సేవ చేయడం అంటే సాక్షాత్తు శ్రీవారికి సేవ సేవ చేయడమే అవుతుంది. అలసిపోయి సేద తీరుతున్న భక్తుల వద్ద నుండి చిన్న పిల్లలను, విలువైన ఆభరణాలను, మొబైల్ ఫోన్స్ లను దొంగిలించి జీవనం సాగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన భద్రతను కల్పించాల్సిన ఆవశ్యకత మనపై ఉన్నదని సూచించారు.స్థానిక బాలాజీ నగర్ లో తరచుగా ఆకస్మిక తనిఖీలు చేపట్టి, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా నిలువరించాలని ఆదేశించారు.అలాగే ఉపాధి కోసం దేశ వివిధ ప్రాంతాల నుండి తిరుమలకు వస్తున్న భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీల వివరాలు పోలీస్ స్టేషన్లో నమోదు చేసుకొని, వారి కార్యకలాపాలపై నిఘా పెంచాలి. అనుమానితులు, పాత నేరస్తులను తరచుగా పోలీస్ స్టేషన్కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలి అని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పిలు వెంకట్రావు పరిపాలన, శివరామి రెడ్డి తిరుమల, డిఎస్పిలు వెంకటాద్రి ఎస్బి, శ్రీనివాస ఆచారి తిరుమల, రవీంద్రారెడ్డి ఏఆర్, సిఐలు విజయ్ కుమార్ తిరుమల 1 టౌన్, సత్యనారాయణ తిరుమల 2 టౌన్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం

- జ్వరాన్ని లెక్క చేయకుండా 3 మండలాల్లో ఎమ్మెల్యే పర్యటన
- ఎమ్మెల్యే కు టిడిపి శ్రేణులు ఘన స్వాగతం
- పార్టీ శ్రేణులకు, అభిమానులకు ఎమ్మెల్యే ఆదిమూలం కృతజ్ఞతలు

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నారాయణ వనం సత్యవేడు ఎమ్మెల్యే గా రెండవసారి గెలుపొంది తొలిసారి నియోజకవర్గంలో పర్యటిస్తున్న కోనేటి ఆదిమూలం టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలుకుతున్నారు.శనివారం ఎమ్మెల్యే పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే రాత్రి నుండి ఎమ్మెల్యే ఆదిమూలం 102 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నారు.కుటుంబసభ్యులు, కుమారుడు సుమన్ పర్యటనను వాయిదా వేసుకోవాలని వారించినా సున్నితంగా తిరస్కరించి ఉదయం ఎమ్మెల్యే పర్యటనకు ఇంటి నుండి బయలుదే రారు.ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పిచ్చాటూరు క్యాంప్ గ్రౌండ్ వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి గజమాల వేసి నివాళి అర్పించారు.అక్కడ నుండి పిచ్చాటూరులోని సప్తగిరి బ్యాంకు

వెనుకవైపు ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయం, నాగలాపురం లో వర్తక సంఘం కళ్యాణ మండపం, సత్యవేడు లో విఎంకె కళ్యాణ మండపం చేరుకున్నారు.అప్పటికే ఎమ్మెల్యే కు స్వాగతం పలకడానికి వేచి ఉన్న టిడిపి నాయకులు, వందలాది కార్యకర్తలు పుష్పగుచ్ఛంలు, గజమాలల తో నీరాజనాలు పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ తన గెలుపుకు శ్రమించిన ప్రతి నాయకునికి, కార్యకర్తకు, అభిమానికి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే సత్యవేడు నియోజకవర్గంలో సగంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను తమ అధినేత చంద్రబాబు యువనేత లోకేష్ సహకారం తో పూర్తి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

ఆరోగ్యానికి వాకింగ్ మంచిదే

మారుతున్న జీవన శైలితో నడకకు పెరుగుతున్న ప్రాధాన్యం

విశాలాంధ్ర - కార్వేటినగరం: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నట్లుగా నగర ప్రజలు ప్రత్యాన్యయ వైద్యంగా వ్యాయామాన్ని ఆశ్రయిస్తున్నారనడంలో అతిశయోక్తి కాదేమో మారుతున్న జీవన శైలిలో ఆరోగ్యం కోసం వాకింగ్(నడక)ఎంచుకున్నారనడంలో అతిశయోక్తికాదేమో. ఆరోగ్యమే మహా భాగ్యం అనే పెద్దల మాటను నేడు నగర ప్రజలు అక్షర సత్యం పాటిస్తున్నారు. రోజుకు ఒక గంట వ్యాయమం చేయడం ద్వారా శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆలోచనా సామర్థ్యం పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని నమ్మిన ఆరోగ్యాభిలాషులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో వీలైతే వ్యాయామ శ్యాలలకు వెళ్లడం, యోగా, సైక్లింగ్కు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనితో నగరంలోని స్కంద పుష్కరిణీ, కళాశాల క్రీడామైదానం, వేణుగోపాలస్వామి ఆలయ మాడవీధులు, జిమ్ములు ఉదయం సాయంత్రం వేళల్లో కిట, కిటకిలాడుతున్నాయి. వాకింగ్ చేసేందుకు వృద్ధులు, యువతీ, యువకులు సైతం పలు ప్రధాన ప్రాంతాల్లో వ్యాయమం చేస్తున్నారు. గతంలోపొలిస్తే ప్రస్తుతం వాకింగ్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గతంలో రోజుకు 50 మంసి నుంచి 70 ఎరకూ వాకింగ్ చేసేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 130 నుంచి 180 వరకూ పెరిగిందని పేర్కొంటున్నారు. రోజుకు ఒక గంట వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆలోచనా సామర్థ్యం పెరుగుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.-అధిక బరువును తగ్గించుకునేందుకు...ప్రస్తుతం జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగా జనాభాలో అధిక శాతం మంది ఊబకాయంతో బాదపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు. యువతీ, యువకులు అధిక బరువు కారణంగా చిన్న వయస్సులోనే వ్యాధుల బారిన పడుతున్నారు. పాస్ట్ఫుడ్స్, కేస్లు, పిజ్జాలు, బర్గర్లు వంటి జంక్ పుడ్స్ను అధికంగా తీసుకోవడం వల్ల ఈ సమస్య వస్తుందని పేర్కొంటున్నారు. అధిక బరువుతో బాధపడుతున్న వారు వాకింగ్ ట్రాక్లలో పరుగులు తీస్తుండగా మరికొందరు యోగా సెంటర్లను ఆశ్రయిస్తున్నారు.-ఆరోగ్య ప్రయోజనాలు ఇవీ ప్రతి రోజూ నడకతో బీపీ, షుగర్లను అదుపులో ఉంచుకోవచ్చు. గుండె జబ్బులు, కొలస్టాల్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు, ఆందోళన, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు.శారీరక శ్రమతో చిన్నారులను ఆడించడం ద్వారా వారిలో ఎదుగుదల, మానసిక పరిపక్వత, ఏకాగ్రత. పెరుగుతుంది.మంచి ఆలోచన శక్తి పెరుగుతుంది.కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి అంశాలలో ప్రజలలో అవగాహన స్థాయి పెరిగింది. ముఖ్యంగా మంచి ఆరోగ్యం కోసం శ్రద్ధ ఎక్కువైంది. శరీర శ్రమతో కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం వివిధ రకాల ఆటల పోటీలను అవగాహనా దస్సులను నిర్వహిస్తుంది.-సుగర్ నియంత్రణలో ఉంది.గత 20 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నాను. రోజూ సాయంత్రం సమయంలో 40 నిమిషాలపాటు నడక నడుస్తున్నాను. షుగర్ నియంత్రణలోనే ఉంది. బలహీనత అంటూ తెలియడ లేదు. ఆరోగ్యంగానే ఉంటున్నా. విజయకుమార్, కార్వేటినగరం-నిద్రబాగా పడతుంది.గత 30 ఎళ్లుగా వాకింగ్ చేస్తున్నా. ఉదయం, సాయంత్రం తప్పకుండా వాకింగ్ చేస్తున్నాను. మోహనమురళీ, ఉపాధ్యాయుడు, కార్వేటినగరం-హాకింగ్ తప్పనిసరిగుండెకు స్టెంట్ వేసిన తరువాత వాకింగ్ తప్పనిరి. గత 20 సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్న. వాకింగ్ వలన శరీరంలో ఉండే నరాలన్నీ కదలడం వలన రక్త ప్రసరణ బాగుంటుంది. తద్వారా మనిషి శక్తిని పుంజుకుంటారు. యుగంధర్, ఉపాధ్యాయు, కార్వేటినగరం-నడకతో మంచి ఆరోగ్యం రోజుకు గంటన్నర నడకతో మంచి ఆరోగ్యంతో పాటు, శరీర దారుధ్యం పెరిగింది. అడుగుల నడక రోగాలను దూరం చేస్తుందన డంలో సందేహం లేదు. ముఖ్యంగా శరీరంలో షుగర్ బీపీ పెరగకుండా ఉంటుందని వైద్యుల కూడా సలహాలు ఇస్తున్నారు.